ప్రజాశక్తి

గురువారం 24 ఆగస్టు 2023

5

పార్వతీపురం మన్యం



70 ఎకరాల్లో వరిపంట నీట మునక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఇటీవల కురుస్తున్న వర్షాలకు సుమారు 70 ఎకరాలు వరి పంట నీటి మునిగి పోయింది. నడుకూరు సమీపంలోనే సీతమ్మధార చెరువు గర్భం లో నీరు కాలువలో ప్రవ హించి ఒట్టిగెడ్డకు వరద పోటెత్తడంతో 70 ఎకరాల వరి పంట నీట మునిగింది. ప్రతిసారి వర్షం కురిస్తే ఇదే పరిస్థితి తలెత్తుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పెట్టిన పెట్టుబడులు రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముంపునకు గురైన వరినాట్లు

ఆంధ్రా గోబ్యాక్ అన్న కేంద్ర మంత్రికి ఆహ్వానమా !

ప్రజాశక్తి-సాలూరు

ఆయనో కేంద్ర మంత్రి. మోడీ నాయకత్వంలో వున్న ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకమైన కేబినెట్ మంత్రి. పెట్రోలియం, గనులు శాఖలు నిర్వహించిన అమాత్యులు. నేడు కేంద్ర విద్యాశాఖా మంత్రి. పక్కనే ఉన్న ఒడిశాకు సీనియర్ పార్లమెంటు సభ్యుడు, దశాబ్దాల కాలంగా నలుగుతున్న కొటియా గ్రామాల వివాదాన్ని రచ్చ కెక్కించడంలో సూత్రధారి. దాదాపు 50సంవత్సరాలుగా ప్రశాంతంగా వున్న కొటియా గ్రూపు గ్రామాల్లో తెరవెనుక వుంటూ అలజడి సృష్టించిన బిజెపి నాయకుడు. కొటియా గ్రామాల్లో వున్న అపార ఖనిజ సంపదపై ప్రేమతో ఆ గ్రామాలన్నీ ఒడిశావే నని కొత్త నాటకానికి తెర లేపిన కాషాయ నాయకుడు ఆయన.

సరిగ్గా నాలుగు నెలల క్రితం కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టు చెన్నూరులో పర్యటిస్తుండగా ఎదురైన ఎపి పోలీసులనుద్దేశించి ఆంధ్రా గోబ్యాక్ అని నోరు పారేసుకున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రధాన్ ఈనెల 25న విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని చిన మేడపల్లిలో నిర్మించనున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వస్తున్నారు. భాద్యత గల కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తూ రాగద్వేషాలకు అతీతంగా ప్రాంతీయ విబేధాలకు తావులేకుండా పని చేస్తానని ప్రమాణం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈఏడాది ఏప్రిల్ 4న వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్టేటస్ కో ఉత్తర్వులు అమలులో ఉన్న పరిస్థితుల్లో, ఒడిశా తో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఆ గ్రామాలపై సర్వహక్కులు వున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత రచ్చకెక్కించాయి. ఆయన చేసిన వ్యాఖ్యలకు దీటుగా డిప్యూటీ సీఎం రాజన్నదొర కూడా స్పందించారు. రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనలా మాట్లాడి ఉండకూడదని చెప్పారు. అలాంటి వ్యాఖ్యలు చేసుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈనెల 25న ఒకే వేదిక పంచుకోనున్నారు.

సాలూరు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సిఎం జగన్ మోహన్ రెడ్డి రానుండడంతో జనసమీకరణ కు

నాడు మంత్రి వ్యాఖ్యలను తప్పపట్టిన రాజన్నదొర

డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఉమ్మడి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రయత్నిస్తున్నారు. లక్షమంది జనాలను సమీకరించి ముఖ్యమంత్రి జగన్ తో శభాష్ అనిపించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ సభకు సాలూరు, పాచిపెంట మక్కువ మండలాల నుంచి పెద్దసంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరుకానున్నారు. వీరిలో కొటియా గ్రామాలకు కొంతమంది గిరిజనులు, గిరిజన నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. అప్పట్లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గాని, జిల్లా అధికారులు గాని స్పందించకపోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆంధ్రా గో బ్యాక్ అంటూ వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో కలిసి వేదికను ఎలా పంచుకుంటారని కొన్ని రాజకీయ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. ఆయనతో క్షమాపణలు చెప్పించాలని లోక్ సత్తా అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు.

సాలూరులో సభ ఎందుకు వద్దన్నారు?

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమాన్ని వర్చువల్ పద్దతి లో చేసి సాలూరు పట్టణం లో బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళిక రూపకల్పన జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సిఎం జగన్ మోహన్ రెడ్డి కూడా అంగీకరించారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరి కొద్ది నెలల్లో ఎన్నికలు ఎదుర్కోనున్న వైసిపి ఈ కార్యక్రమం ద్వారా మైలేజీ పొందాలని భావిస్తోంది . అయితే సాలూరులో సభ వద్దని, శంకుస్థాపన ప్రదేశం లోనే సభ నిర్వహించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పినట్లు సమాచారం. సాలూరు లో సభ నిర్వహిస్తే హాజరుకాబోనని ఖరాఖండిగా ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో గత్యంతరం లేక అధికారపార్టీ పెద్దలు నిర్ధేశిత శంకుస్థాపన ప్రదేశం లోనే సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వేళ సాలూరు పట్టణం లో సభ నిర్వహిస్తే తాను చేసిన వ్యాఖ్యల దృష్ట్యా తెలుగు ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుందేమోనన్న భయంతోనే కేంద్రమంత్రి ప్రధాన్ నిరాకరించినట్లు తెలుస్తోంది.

సిసిఆర్‌సి కార్డుదారులందరికీ రుణాలివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభదశలో ఉన్నాయని, రైతులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన సమయమిదేనని, కావున జిల్లాలో సిసిఆర్‌సి కార్డు గల పదివేల మంది రైతులు, కౌలురైతులు, డిపట్టా రైతులందరికీ వ్యవసాయ పంట రుణాలను నూరు శాతం మంజూరు చేయాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో బ్యాంకు అక్కౌంట్లు నిర్వహణ, బ్యాంకుల లక్ష్యాలు, రుణాల మంజూరుపై బ్యాంకర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే పదేళ్ల పైబడి నిర్వహణలో లేని వ్యక్తిగత బ్యాంకు అక్కౌంట్లను గుర్తించి సంబంధికులకు అందులో గల డబ్బులను అందించాలని తెలిపారు. డిపాజిట్లును సంబంధిత అక్కౌంట్లు హెూల్డర్లకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్యాంకర్లను కోరారు. ప్రజలు, సచివాలయ సిబ్బంది సహకరించి నిర్వహణలో లేని అక్కౌంటుదారులు ఇ-కెవైసీ చేయించుకొని అక్కౌంటులో గల డబ్బులను పొందాలని కోరారు. మత్స్యకారులకు, పశు పెంపకందార్లకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాలని, దీని ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలు మంజూరు చేయాలని అన్నారు. పాడిపశువుల కొనుగోలుకు హామీలేని రుణాలను బ్యాంకులు అందిస్తున్నాయని, వాటిని ప్రజలకు తెలియజేసి ఉపయోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్థిక వనరులు అందించేందుకు నీతిఆయోగ్ పొందుపర్చిన పారామీటర్స్ ప్రకారం పర్యవేక్షిస్తారని, ఆయా అంశాలకు సంబంధించి లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి మాట్లాడూతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలకు సంబంధించి లోను ధరఖాస్తులకు రుణాలు మంజూరు చేయాలని, స్వయం సహాయక సంఘాలకు పశువుల యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకర్లు ప్రోత్సాహమివ్వాలన్నారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్‌డిఎల్ నాగప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారామ్, ఇతర బ్యాంకుల నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఒక్కపూటే తాగునీటి సరఫరా

పాలకొండ రూరల్: వెంకంపేట వాటార్ టాంకర్‌కు సంబంధించిన సంకిలి ఏరియాలో పంపింగ్ బోర్ రిపేర్ అయినందువల్ల ట్యాంక్ పరిధిలో గల 1,2,12,18,19,20 వార్డులకు ఒక పూట మాత్రమే నీటి సరఫరా చేయగలమని కమిషనర్ సర్వేశ్వరరావు పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రిపేరింగ్ పనులు జరుగుతున్నాయని, అనంతరం యధావిధిగా నీటి సరఫరా చేస్తామన్నామన్నారు.



ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

ఇంజినీరింగ్ పనులు వేగవంతం

ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ప్రజాశక్తి - సీతంపేట

ఇంజినీరింగ్ శాఖల్లో జరుగుతున్న అన్ని రకాల పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, గిరిజన సంక్షేమ, ఎపిఇపిడిసిఎల్, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హౌసింగ్ లే అవుట్లలో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అన్నారు. ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న టూరిజం పనులను పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో పిఆర్ ఇఇ రాధారాణి, డిఇ లోకనాథం, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లీశ్వరరావు, హౌసింగ్ డిఇ మోహనరావు, ఇతర డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఫైజర్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 లేదా2023లో ఇంటర్ పాసై ఉండి 50శాతం మార్కులతో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలంతా జాబ్ మేళాకు అర్హులని అన్నారు. నెలకు రూ.12,500 జీతంతో పాటు, ప్రముఖ విశ్వవిద్యాలయంలో డిగ్రీ విద్యను కూడా ఉచితంగా చదివిస్తారని చెప్పారు. జాబ్ మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్, మూడు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8754048632 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

జయహో.. ఇస్రో

చంద్రయాన్ విజయవంతంతో జిల్లా వ్యాప్తంగా సంబరాలు

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. జయహో ఇండియా, కంగ్రాట్యులేషన్స్ ఇస్రో, కంగ్రాట్స్ ఇస్రో.. నినాదాలు మిన్నంటాయి. జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. ఆనంద సమయంలో స్వీట్లు పంచిపెట్టారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో ఇస్రో, చంద్రయాన్ రాకెట్ ఆకారాల్లో నమూనాలను ప్రదర్శించారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఇస్రో ప్రయోగించిన విక్రం లాండర్ చందమామపై ల్యాండింగ్ దృశ్యాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపల్ జయరామారావు ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా టీవీ స్క్రీన్‌పై వీక్షించారు. ప్రయోగం విజయవంతమైన అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశఅంతరిక్ష పరిశోధనలో నేడు కీలకమైన ఘట్టాన్ని అధిరోహించి ప్రపంచ వరుసలో భారతదేశం చేరిందన్నారు. భారతీయ, ఇస్రోశాస్త్రవేత్తల కృషికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు చంద్రయాన్ -3 విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు.

వీరఘట్టం : భారత్ చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం వల్ల ప్రపంచ దేశాల్లో అంతరిక్ష యాత్రలో భారతదేశం గొప్ప విజయాన్ని సాధించింది దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన మొట్టమొదటి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకం పట్టి గ్రామంలో తిరిగారు. అలాగే విక్రంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకం పట్టుకొని పాఠశాల ఆవరణలో పరిగెత్తారు.

చంద్రయాన్-3 విజయం గర్వకారణం

చంద్రయాన్ 3 విజయవంతం కావడం భారతీయులు అందరికీ గర్వకారణమని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో చంద్రుని దక్షిణ భాగంలో కాలు మోపిన మొదటి దేశంగా భారత్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సాఫీగా చేరిన క్షణాలు మరపురానివని, ఎంతో క్లిష్టమైన ఈ ప్రక్రియను తక్కువ ఖర్చుతో సమర్ధవంతంగా సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వైజ్ఞానిక రంగంలో అగ్రగామిగా నిరూపించిన చంద్రయాన్ 3 భారత్ శక్తి వంతమైన దేశంగా బలపడడానికి ముందడుగుగా పేర్కొన్నారు. ఇది భారత్‌కు పండుగ రోజుఅని తెలిపారు.



వీరఘట్టంలో జాతీయ పతాకంతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థినిలు



రైలు ఢీకొని మృతి చెందిన గొర్రెలు

రైలు ఢీకొని 45 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో పాత రైల్వే గేటు సమీపాన రైలు ఢీకొని సుమారు 45 గొర్రెలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం మండలంలో పెదభోగిలికి చెందిన డి.అప్పలనాయుడు, నాగళ్ల రాము, పాపమ్మ వలసకు చెందిన కోడిబోను మంగయ్యకు చెందిన సుమారు 45 గొర్రెలు తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో బొబ్బిలి నుండి పార్వతీపురం వైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొని మృతి చెందాయి. ఈ సంఘటనలో సుమారు రూ. రెండు లక్షల 50 వేలు విలువైన గొర్రెలు మృతి చెందినట్టు బాధితులు వాపోతున్నారు. ఈ సంఘటనపై బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాలంటీర్లతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోండి : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయులు, వాలంటీర్లను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ ఉన్న గ్రామ వాలంటీర్లతో చర్చించారు. ఎక్కువగా ఈ పాఠశాలలో డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉందన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. డిఇఒతో పాటుగా డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్, గ్రామ సర్పంచి బి.గౌరీ శంకర్రావు, మండల ఉపాధ్యక్షులు ఎన్. శేఖర్ ఉన్నారు.



దుర్గాప్రసాద్ (ప్లానెటరీ శాస్త్రవేత్త)

చంద్రయాన్-3 విజయవంతంలో

విజయనగర వాసులు



సతీష్ (సీనియర్ శాస్త్రవేత్త, ఇస్రో)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చంద్రయాన్ - 3 ల్యాండింగ్ గురించి దేశం మొత్తం ఉత్సుకతతో ఉండగా, విజయనగరానికి చెందిన డాక్టర్ కరణం దుర్గా ప్రసాద్ ఈ ముఖ్యమైన మిషన్‌లో భాగం కావడంతో విజయనగరం ప్రజలు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ కరణం దుర్గా ప్రసాద్ అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ (పి అర్ ఎల్) (అంతరిక్షం ఇస్రో యొక్క విభాగం)లో ప్లానెటరీ శాస్త్రవేత్త. అతను మొదటి నుంచి చంద్రయాన్-2, చంద్రయాన్-3 మిషన్‌లతో సంబంధం కలిగి ఉన్నారు. చంద్రా యొక్క ఉపరితల థర్మోఫిజికల్ ప్రయోగం అనే పరికరం యొక్క లీడ్స్‌లో ఒకరు. ఇది ఒక థర్మామీటర్ లాగా ఉంటుంది. చంద్రుని మొదటి ఉపరితలం యొక్క సిటు థర్మల్ ప్రొఫైల్‌ను అందించడానికి చంద్రుడి టాప్ 10 సెం.మీ ఉష్ణోగ్రతలను కొలుస్తుంది. ఇది భవిష్యత్తులో చంద్రుని అన్వేషణలో ముఖ్యమైన అంశం అయిన నీరు-మంచు, ఇతర వనరుల స్థిరత్వ మండలాల గురించి చెప్పే ముఖ్యమైన ప్రయోగం. ఇటీవలే, డాక్టర్ దుర్గా ప్రసాద్ అతని బృందం చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ చేయబోతున్న ప్రదేశాల గురించి సవివరమైన సర్ఫస్ సైన్స్ అధ్యయనాన్ని కూడా నిర్వహించింది. ఈ పని ల్యాండింగ్‌కు ముందు ల్యాండింగ్ సైట్ లక్షణాలను అర్థం చేసుకోవడంలో మాత్రమే కాకుండా, కార్యకలాపాలను ప్లాన్ చేయడంలోను, చంద్రయాన్-3 ల్యాండర్ రోవర్‌లోని పరికరాల నుంచి శాస్త్రాన్ని పొందడంలో కూడా సహాయపడుతుంది.

ల్యాండింగ్ బృందంలో సతీష్

చంద్రయాన్-3 ల్యాండింగ్ టీమ్‌లో ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తగా సంతకవిటి మండలం సిరిపురానికి చెందిన బూరాడ సతీష్ సేవలందించారు. విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ కోసం కీలకమైన 25 మంది శాస్త్రవేత్తలతో ఇస్రో ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. అందులో సతీష్ ఒకరు కావడం జిల్లాకు గర్వకారణం.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

జ్యూట్‌మిల్లు తెరిపించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించి, గతంలో పనిచేసిన కార్మికులందరికీ పని కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీగిరాంలోని ఎపి ఫైబర్స్ జ్యూట్ మిల్లు వద్ద రెండో రోజు దీక్షలను ప్రారంభించిన అనంతరం కార్మికులకు మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏకైక జ్యూట్ మిల్లు అని, దీన్ని నడిపించడంలో అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి, కార్మిక ప్రయోజనాల దృష్ట్యా చర్చించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్మిక వర్గం చేస్తున్న న్యాయమైన దీక్షలకు, వారి సమస్యల పరిష్కారానికి చేసే పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని అన్నారు. సాలూరు ప్రాంతంలోనే ప్రజలు, మేధావులు, ఉద్యోగులు, సంఘాలు కూడా అండగా నిలవాలని కోరారు. మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తామని ముఖ్యమంత్రి వైయస్ జగనమోహన్ రెడ్డి హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక జ్యూట్ మిల్లుల తెరిపించడం మాట పక్కన పెడితే రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగేలా పరిశ్రమ అధిపతులకు ఊత మిచ్చి కార్మికుల పొట్టలు కొట్టే నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని విమర్శించారు. కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇక్కడే అర్ధమవుతుందని అన్నారు. కావున జ్యూట్ మిల్లును ఎంతటి పోరాటం చేసైనా కాపాడుకోవాల్సిన కర్తవ్యం కార్మికులపై ఉందన్నారు. దీక్షలకు ఎపి వ్యవసాయ కార్మికసంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు మద్దతు ప్రకటించారు. రెండో రోజు దీక్షల్లో మహిళా కార్మిక నాయకులు రాజాన ఇంద్రావతి, రౌతు సత్యవతి, ఈదుబిల్లి పద్మ, ఎస్.సుశీల, నల్ల దేవి, జెఎసి నాయకులు సింహాచలం, రామారావు, నారాయణరావు, శ్రీనివాసరావు, సింహాచలం పాల్గొన్నారు.

సిఆర్‌టిలందర్నీ రెన్యువల్ చేయాలని

25న నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి -కలెక్టరేట్

సీతంపేట ఐటిడిఎ పరిధిలో పని చేస్తున్న సిఆర్‌టిలందర్నీ రెన్యునల్ చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా కార్యదర్శులు ఎ.భ్యారరావు, కృష్ణారావులు తెలిపారు. ప్రభుత్వం 259 మందిని రెన్యువల్ చేయాలని, ఆర్థిక అనుమతితో ఉత్తర్వులు ఇస్తే 220 మందిని రెన్యువల్ చేశారని, మిగిలిన వారిని రెన్యువల్ చేయలేదని అన్నారు. ఈ సందర్భంగా మిగిలిన సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని అనేక సార్లు పిఒను కోరినా ఫలితం లేదన్నారు. దీంతో ఈనెల 25 నుంచి సీతంపేట ఐటిడిఎ కార్యాలయం వద్ద నిరవధిక నిరహార దీక్షలు (ఆమరణ దీక్షలు) చేపడుతున్నట్లు తెలిపారు. మిగిలిన ఐటిడిఎల్లో అందరిని రెన్యువల్ చేశారని, పోస్టులు లేకపోతే ఎగెనెస్ట్ ఎస్‌జిటిల్లో నియమించారని, కానీ, ఇక్కడ అలా జరగలేదని అన్నారు. 15 ఏళ్ల నుంచి పని చేస్తున్న వారిని తీసేయడమంటే మానవత్వం లేని చర్యగా భావిస్తున్నామని అన్నారు. ఈ పోరాటానికి గిరిజన, విద్యార్థి సంఘాలు మద్దతు నిస్తున్నాయని తెలిపారు. జరగరాని సంఘటనలు జరిగితే ప్రాజెక్టు అధికారే బాధ్యత వహించాలని వారు తెలిపారు.





ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ, గిరిమిత్ర భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ హాజరై టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. నిస్వార్థంతో దేశ స్వాతంత్ర్యానికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని, వారి చరిత్ర నేటి విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులతో కలసి ఆంధ్ర కేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు దేశభక్తిని, త్యాగనిరతిని ప్రజా సంక్షేమ దృష్టిని ఆదర్శంగా తీసుకుని తాము కూడా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ, సిహెచ్.లక్ష్మణరావు, ఎఆర్ ఆర్‌ఐలు, కుమార్, శ్రీరామ్, డిసిఆర్‌బి ఎస్‌ఐ పాపారావు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎపిఒ వై.రోసిరెడ్డి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో డిడి ఎం.శ్రీనివాసరావు, పిఎఒ హరికృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ విజయరాణి, సూపరిండెంట్ దేశ్, డిప్యూటీ ఎస్‌ఒ అప్పారావు, ఎఎంఒ కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోనిటంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడు, తదితర గ్రామాల్లో జనసేన క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్లు ఎం.పుండరీకం, జనసేన జానీ టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకొండ:

డివిజన్ పరిధిలో శ్రీనివాస కల్యాణం మండపంలో ప్రజా గాయకుడు గద్దర్‌కు బహుజన, దళిత, ప్రజా సంఘాలు సంయుక్తంగా నివాళి అర్పిస్తూ సంస్మరణ సభ నిర్వహించాయి. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాయకులు కంఠ వేణు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘ నాయకులు సూతపాటి భరత్ భూషణ్ రాజు, బిఎస్‌పి నాయకులు బొచ్చు బుద్ధుడు, కార్మిక సంఘ నాయకులు దావాల రమణారావు, ఎంపిపి బొమ్మలి సుధాకర్, నిర్వాహకులు బత్తిన మోహన్, గురుబిల్లి రవికుమార్, పొట్నూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు. జానపద గేయకారుడు పాటల తూటా ఉదయ భాస్కర్ గేయాలు ఆలపించగా ఆద్యంతం సభ ఘనంగా జరిగింది.

గ్రామీణ ప్రాంతాలకు అత్యవసర సేవలు


ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో అత్యవసర సేవలందించాలని 104 వాహనాల ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని 104 వాహనాలను పరిశీలించారు. వాహనాల్లో ఎటువంటి సాంకేతిక సమస్యలున్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సేవలను అందిస్తున్నామని, వాటిని అలాగే కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

గాయత్రి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఫైజర్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వివికె మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 లేదా2023లో ఇంటర్ పాసై ఉండి 50శాతం మార్కులతో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలంతా జాబ్ మేళాకు అర్హులని అన్నారు. నెలకు రూ.12,500 జీతంతో పాటు, ప్రముఖ విశ్వవిద్యాలయంలో డిగ్రీ విద్యను కూడా ఉచితంగా చదివిస్తారని చెప్పారు. జాబ్ మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8754048632 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పాఠశాలల పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద బుధవారం ఎపి ప్రభుత్వ పాఠశాల కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎపి పాఠశాల కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ గౌరవ అధ్యక్షులు కాద రాము, అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి పి.జ్యోతి మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా 5న వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, అందర్నీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించా లని తదితర సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.రజిని, బి.గౌరీ, పి.గౌరి, డి.నరసమ్మ, టి.ధనలక్ష్మి, డి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంగాపురంలో ఇ-క్రాప్ నమోదు పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట

వెంగాపురంలో ఇ- క్రాప్ నమోదును శ్రావణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్‌ను ప్రతి రైతు తప్పని సరిగా తను సాగుచేస్తున్న పంట వివరాలను రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసినచో ఆ వివరాలతో సంబంధిత భూమిపైకి వెళ్లి జియో కోఆర్డినేట్ల ఆధారంగా పంట వివరాలను ఇ క్రాప్ నమోదు చేస్తారన్నారు.. రైతులంతా మీరు వేసిన పంటను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 15లోగా ఇ-క్రాప్ పూర్తి చేసుకోవాలన్నారు.

25న బైక్ ర్యాలీ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకల్ల నుంచి ఈనెల 25న జనసేన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు జనసేన ఉత్తరాంధ్ర నాయకులు బిపి నాయుడు, క్రియ శీలక సభ్యత్వ వాలంటీర్లు ఎంపుండరీకం, నాయకులు జానీ, కె.సాయిపవన్, కె.వెంకటరావునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పుండరీకం మాట్లాడుతూ గ్రామదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గులాబీ రంగు కాయతొలుచు పురుగు యాజమాన్యం

ప్రజాశక్తి - పాచిపెంట

పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్మవలసలో గులాబీ రంగు కాయ తోలుచు పురుగు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ పత్తి పంటలో కాయ తోలుచు పురుగుల నివారణ అత్యంత ప్రధానమైన అంశమని, పురుగుమందుల పిచికారితోనే కాకుండా సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా మాత్రమే కాయతొలుచు పురుగులు నివారించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కాయ తొలుచు యాజమాన్యంలో ముఖ్య పాత్ర వహించే లింగాకర్షక బుట్టల తయారీ, పనిచేసే విధానాన్ని రైతులకు వివరించారు. అనంతరం రైతులకు లింగాకర్షణ బుట్టలు, పురుగులు ఆకర్షించే నూరులను పంపిణీ చేశారు. విఎఎ మోహనకృష్ణ పొటాషియం సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా తయారీని ఉపయోగాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద ఆర్ అప్పారావు మరియు రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కొత్తవలస పంచాయతీ దాగరవలసలో కిడ్నీ వ్యాధితో ఇటీవల మరణించిన పాలిక రాము కుటుంబానికి తక్షణ సహాయం కింద వైఎస్సార్ భీమా రూ.10వేలును కొత్తవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి నెమలిపిట్ట కల్యాణ్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండగొర్రి ఉదయ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ, గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తొలగించిన ఓటు నమోదుకు అవకాశం

ప్రజాశక్తి - భామిని


ఓటర్ల జాబితా నుండి తప్పుగా తమ పేర్లను తొలిగించిన వ్యక్తులు, తమ పేరును తొలిగించినందుకు వ్యతిరేకంగా కలెక్టర్‌కు నిర్ణీత గడువులోగా అప్పీలు చేయవచ్చని తహశీల్దార్ ఎన్.అప్పారావు తెలిపారు. ఓటర్ జాబితా నిరంతర నావినీకర సమయంలో, తొలిగించిన వ్యక్తి, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఫారం-6 అందజేసి తన ఓటును నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. కావున ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

పెరుగుతున్న ఆదరణ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు మంచి ఆదరణ పెరుగుతుంది. బుధవారం ఏడో రోజు కోమట్లపేట వద్దని సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా వినూత్న రీతిలో ఆవుల మెడలో పువ్వుల దండలు వేసి నిరసన శిబిరం వద్ద రిలే నిరాహార దీక్ష చేశారు. ఇప్పటికే అన్ని పార్టీల, ప్రజాసంఘాల నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు గానీ నోరులేని మూగజీవులు కూడా నిరాహార దీక్షకు వచ్చి మద్దతు తెలిపి పరిస్థితి ఉందంటూ ఎద్దేవా చేశారు. దీక్షలకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు , నేటి ధర్మబాణం ఎడిటర్ అట్టాడ రవికుమార్, అరకు పార్లమెంటు ఎస్సీ, ఎస్టీ సెల్ అధికారి ప్రతినిధి నందివాడ కృష్ణ బాబు, అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, అరుకు పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు బిడ్డిక తమ్మయ్య, కొమరాడ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మరిచర్ల సత్యనారాయణ సంపూర్ణ మద్దతు తెలిపారు. మండలానికి అతిముఖ్యమైన వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో సాధన కమిటీ సభ్యులు వి.ఇందిర, కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, పకీరు, కందిస శంకర్రావు, లక్ష్మణరావు, పోలినాయుడు, నాగావళి నది ఆవల ఉన్న గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న వంతెన సాధన కమిటీ నాయకులు, టిడిపి నాయకులు

పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మించాలి

సాలూరు: కురుపాం నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం వెంటనే ప్రారంభించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 గ్రామ పంచాయతీలకు చెందిన 60 గ్రామాల ప్రజలు ఈ వంతెన నిర్మాణం కాకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 2004లో సిపిఎం, ఇతర గిరిజన సంఘాల పోరాట ఫలితంగానే అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలి వుందని చెప్పారు. వైసిపి ఈ ప్రాంత ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈనెల 17నుంచి వంతెన నిర్మాణం కోరుతూ గిరిజనులు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ దీక్షలకు గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు సూకురు గంగయ్య, సీదరపు బోడమ్మ పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన నాయకులు


ప్రజాశక్తి -సాలూరు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును గిరిజన సంఘాల నాయకులు బుధవారం కలిశారు. ఆయన నివాసంలో కలిసి పలు గిరిజన సమస్యల గురించి వివరించారు. వైసిపి ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ కొండగొర్రి ఉదయ్ కుమార్, గిరిజన సంఘాల నాయకులు నెమలి పిట్ట కళ్యాణ్, సీదరపు నూకయ్య, అప్పారావు శంకరరావును కలిశారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో గిరిజన విద్యార్థులకు కోటా పెంచేలా చూడాలని కోరినట్లు ఉదయ్ కుమార్ చెప్పారు. షెడ్యూల్ గ్రామాల సమస్యని కూడా పరిష్కరించాలని కోరామని తెలిపారు. త్వరలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసినప్పుడు షెడ్యూల్ గ్రామాల అంశాన్ని ప్రస్తావిస్తానని చైర్మన్ శంకరరావు చెప్పారని తెలిపారు.

రుణాల వసూళ్లపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి -పాచిపెంట

వెలుగు ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలను శత శాతం వసూలు చేయాలని వెలుగు సిబ్బంది విఎలు, సిసిలకు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టు పరిధిలో గల రకాల పనులపై సమీక్షించారు. ముఖ్యంగా స్త్రీ నిధి ఉన్నత బ్యాంకు లింకేజీ పథకాలతో తీసుకున్న అప్పులు, మహిళా సంఘాల సభ్యులు ఏదో ఒక జీవన ఉపాధికి కచ్చితంగా ఉపయోగపడేలా చూడాలన్నారు. అలాగే తీసుకున్న రుణాలు వందశాతం వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఇటీవల ఉద్యాన శాఖ, వెలుగు సంయుక్తంగా రూ.15లక్షలతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు వెలుగు ఎపిఎం సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

సామూహిక సెలవు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చలో విజయవాడ కార్యక్రమానికి సామూహిక సెలవు ఇవ్వాలని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు కమిషనర్ జె.రామఅప్పలనాయుడుతో అన్నారు. బుధవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై ఈనెల 24న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి తరలి రావాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు కార్మికులంతా విజయవాడ వెళ్తున్నామని, కనుక అందరికీ సామూహిక సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు జి.సత్యనారాయణ, టి.వినయ్, జెఆర్‌బి రాజు, పి.చిన్నికృష్ణ, పి.రాజ్‌కుమార్, వై.శంకర్రావు, జి.శంకర్రావు, ఎ.తాతబాబు, సిహెచ్ సింహాచలం, ఎన్.మల్లేశు, ఎం.సీత, ఎన్.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి ఓటరు విచారణ 98 శాతం పూర్తయ్యిందన్నారు. సాలూరు నియోజకవర్గంలో 7.25 శాతం పెండింగ్‌లో ఉందని,197817 మంది ఓటర్లకు గానూ ఇప్పటి వరకు 183468 మంది ఓటర్లను పరిశీలించామన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 197969 ఓటర్లు ఉండగా 173 మందిని, కురుపాంలో 186610 ఓటర్లు ఉండగా 75 మందిని, పార్వతీపురం లో 187748 ఓటర్లు ఉండగా 1457 మందిని పరిశీలించాల్సి ఉందని ఆయన తెలిపారు. ఇంటింటి విచారణలో 4320 మంది లేనట్లు (ఆబ్సెంట్) గుర్తించామన్నారు. అలాగే 3209 మంది శాశ్వతంగా ఆయా గ్రామాల నుండి వెళ్లిపోయిన ఓటర్లను గుర్తించామని చెప్పారు. 13,624 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించగా, 1848 డుప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం దరఖాస్తులు 82019 అందాయన్నారు. ఓటరు జాబితాలో దిద్దుబాటు కోసం 57790 దరఖాస్తులు అందాయని, మొత్తం దరఖాస్తులలో 11,812 అప్ లోడ్ చేశామని, మిగిలినవి ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబిత పునశ్చరణ సంతృప్తికరంగా జరిగిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఓటరు జాబితా నుండి 23 వేల వరకు ఓట్లు తొలగించ వచ్చని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 29 నుండి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ జరుగుతుందని, ఒక పోలింగ్ కేంద్రంలో 15 వందల ఓట్లు మాత్రమే ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఒక కుటుంబం, అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న కుటుంబాలు, ఒక వీధిలో ఉన్న కుటుంబాలు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలుంటే తెలియజేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట రావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి డోర్ నెంబరులో ఓటర్లు సరిపోవాలి

పార్వతీపురంటౌన్/రూరల్ : ఒక ఇంటి డోర్ నెంబరులో ఉన్న ఓటర్ల వివరాలు ఓటరు జాబితాలో సరిపోవాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. పట్టణంలోని కొత్తవలస, గిజబ కాలనీ, నవిరి ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు పునశ్చరణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఇంటింటి ఓటర్ల విచారణ పక్కాగా జరగాలని ఆమె స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటి డోర్ నెంబరులో ఉన్న ఓటర్ల వివరాలు ఓటరు జాబితాతో సరిపోవడం లేదని, ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు చూపిస్తుందని రాజకీయ పార్టీల సమావేశంలో తెలిపిన మేరకు ఆర్.డి.ఓ స్వయంగా తనిఖీలు నిర్వహించారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబరు 29 వరకు ఓటరు కార్డుపై ఫోటో మిస్ మేచింగ్, క్లారిటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు వంటి అంశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. 2023 అక్టోబరు 1నాటికి, 2024 జనవరి 1 నాటికి అర్హత కలిగి నమోదు చేసుకోని అభ్యర్థులను నమోదు చేయడం జరుగుతుందన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములకు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే యుద్ధ ప్రాతిపదికన హక్కులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల గౌరవ అధ్యక్షులు సూకురు అప్పలస్వామి, సహాయ కార్యదర్శి కొర్ర కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గొట్టూరు పంచాయతీ తోక మెట్టజంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం పాచిపెంట ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల పాలకుల చిన్నచూపు వల్ల తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు నేటికీ హక్కులు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ అధికారులు, ప్రభుత్వం తలచుకుంటే కుడుమూరు, కొండతాడూరు భూములకు పట్టాలు నెల రోజుల్లో ఇవ్వొచ్చని, గిరిజనుల పట్ల చిన్నచూపు వల్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా సాగు హక్కులు జాబితా ప్రకటించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిట్టిపురం, తుమ్మరావల్లిలో ఆంధ్రా జమీందారుల పేరుతో భూములను కాలయాపన చేస్తూ గిరిజనులకు భూమ్మీద హక్కులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలు ప్రాధాన్యతను తగ్గించి పీసా చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు పాలకులు మానుకోవాలని అన్నారు. గిరిజన సంఘం ప్రతినిధి బురిడి సన్యాసిరావు మాట్లాడుతూ మణిపూర్లో గిరిజనులపై దాడులు మహిళలపై అత్యాచారాలు అమానుషమని, అక్కడ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, అక్కడి బాధిత గిరిజనులకు అండగా నిలవాలని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి రహదారులు, వైద్యం అందుబాటులో ఉండేలా పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

సిఎం సభను విజయవంతం చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెల 25న శుక్రవారం సాలూరు నియోజకవర్గ మెంటాడ మండలంలో నిర్వహించే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంపిపి బి.ప్రమీల అన్నారు. మండల కేంద్రమైన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలానికి సిఎం వస్తున్నారని, ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మండలం ముఖ్య నాయకులతో సభ విజయవంతానికి చర్చించారని తెలిపారు. ఇందులో భాగంగా మండలానికి 31 బస్సులు కేటాయించామన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో వెలుగు సిబ్బందితో మాట్లాడటం జరిగిందని, వారు కూడా గ్రామస్థాయిలో ఉన్న సర్పంచులకు, ఎంపిటిసిలకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పింఛను లబ్ధిదారుల వివరాలు పరిశీలన

ప్రజాశక్తి - భామిని

గతంలో పెన్షన్ మంజూరై, కారణాలు రీత్యా నిలిచిన పెన్షన్లు, కొత్త పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వివరాలు, సాంకేతిక కారణాలతో ఆగిన పెన్షన్ సంబంధిత లబ్ధిదారులు వివరాలను, కొత్తగా మంజూరైనా పెన్షన్ వివరాలు క్షేత్ర స్థాయిలో ఎంపిడిఒ జి.చంద్రరావు, ఇఒపిఆర్‌డి జి.కృష్ణారావు పరిశీలించారు. భామిని, ఘనసర సచివాలయం పరిధిలో 96 పెన్షన్లు పరిశీలించినట్టు ఎంపిడిఒ తెలిపారు.

బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - భామిని

ప్రజలపై నిత్యం భారాలు మోపుతున్న బిజెపి విధానాలను ప్రజలంతా ఐక్యమై తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు పిలుపునిచ్చారు. మండలంలోని బాలేరులో సిపిఎం మండల కమిటీ సమావేశం కొండగొర్రి భాస్కరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజురోజుకూ నిత్యావసర వస్తువులు ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై పెనుభారాలు మోపుతుందన్నారు. దీంతో పాటు నిరుద్యోగం సమస్య ఎన్నడూ లేని విధంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ సంస్థలన్నింటినీ కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టే పనిలో ఉందని విమర్శించారు. వీటన్నింటికీ నిరసనగా ఈనెల 30,31 తేదీల్లో కరపత్రాలు పంపిణీ, సెప్టెంబర్ 3 సచివాలయాల వద్ద నిరసన, 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్టు తెలిపారు.



వర్షానికి జలమయమైన పట్టణంలోని ప్రధాన రహదారి

భారీ వర్షానికి జలమయమైన ప్రధాన రహదారి

ఏటా ఇదే సమస్య

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు వీధుల రోడ్లతో పాటు ప్రధాన రహదారి జలమయమైంది. వరద నీటితో పాటు, రహదారికిరువైపులా మురుగు కాలువలో ఉన్న నీరు ప్రధాన రహదారిపైకి చేరి ప్రవహించడంతో చెరువును తలపించేలా ఉంది. దీంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇదే పరిస్థితి. ఈ సమస్య పరిష్కారానికి అటు ఆర్ అండ్ బి అధికారులు కానీ, ఇటు మున్సిపల్ అధికారులు గానీ చర్యలు చేపట్టకపోవడం దారుణమని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి కాలువల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు చేపడితే గానీ ఈ సమస్య పరిష్కారం జరగదని పట్టణ ప్రజలు అంటున్నారు. ఈ సమస్య పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేస్తారో లేదో చూడాలి మరి.


టిడిపి గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ గెలుపునకు కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక సాయిబాబా గుడి మైదానం వద్ద మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త కష్టపడి గ్రామాల్లో పనిచేస్తూ టిడిపి ప్రవేశ పెట్టబోతున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, కిమిడి రామరాజు, సుకేష్ చంద్ర పండ, చంటి తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే గిరిజనాభివృద్ధి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మారుమూల కొండలపై గ్రామాలైన వంగర, డోలుకోన, సందిగూడ, మర్రిగూడలో టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజనులు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ముఖ్యంగా మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబం మొత్తం అభివృద్ధి అవుతుందని, మహిళలకు మహాశక్తి అనే మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వెంకటరావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ బుజ్జి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మహిళ అధ్యక్షులు నాగవేణి, కళావతి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో మహాశక్తి యాత్ర నిర్వహిస్తున్న జగదీశ్వరి

కొట్లాటలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ఎమ్మార్ నగరంలో బుధవారం కుళాయి నీళ్ల కోసం ఇరు కుటుంబాల మధ్యన జరిగిన కొట్లాటలో 8 మందికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బసవ ధర్మారావు, తిరుమరెడ్డి బాలరాజు కుటుంబాల మధ్య జరిగిన కొట్లాటలో 8 మంది గాయపడి నట్టు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రక్తహీనత నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు, పిల్లల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన గాదెలవలసలో బుధవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, పిల్లల ఆరోగ్యం పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్య వివరాల ఆన్లైన్ నమోదులో రక్తహీనతగా గుర్తించిన విద్యార్థులు, ఇవ్వబడిన ఐరన్ మాత్రల వివరాలు పరిశీలించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ప్రతిరోజూ ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. ఐరన్ మాత్రల లభ్యత(స్టాక్)పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డుల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శంకర్రావు, ఉపాధ్యాయ, అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం



పామాయిల్‌గెల పడి పగిన కారు అద్దాలు

పామాయిల్ గెలలతో వెళ్తున్న లారీ దాని వెనుక వెళ్తున్న కారుపై గెలలు పడిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న అంశాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక దూళికేశ్వర ఆలయం సమీపంలో గల చెట్టు దగ్గర పామాయిల్ గెలలతో వెళ్తున్న లారీ వద్ద గల పామాయిల్ గెలలు చెట్టుకు తగిలివెనక వస్తున్న కారు మీద పడగా కార్ డ్రైవర్ వద్ద అద్దం పగిలి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పసికందుతో కారు వెనక సీటు లో కూర్చున్న భార్యాభర్తలకు, పసికందుకు ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంతేకాక నిత్యం పామాయిల్ గెలలతో ట్రాక్టర్లు, లారీలతో కనీసం కట్లు కూడా లేకుండా అధిక లోడులతో పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్తుంటాయని ఎప్పుడు అవి ఇలాగే ఎక్కడో ఒకచోట పడుతుంటాయని చెబుతున్నారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు ఎప్పుడూ నడుస్తుంటారని అటువంటిదే వారి మీద పడితే వెంటనే ప్రమాదం జరిగే సంఘటన ఉందని తెలిపారు. కావున సంబంధిత అధికారులు స్పందించి మోతాదుకు మించి లోడులతో వెళ్లకుండా చూసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.